సన్మానం



రాజ్యసభ విప్‌గా నియమితులైన డా.లక్ష్మణ్‌ను అశోక్‌నగర్‌లోని ఆయన నివాసంలో బీజేపీ ముషీరాబాద్ కన్వీనర్ మల్లంపేట రమేష్‌రామ్, బీజేపీ జాయింట్ కన్వీనర్ రఘునాథ్, హరినాథ్‌గౌడ్ తదితరులు సన్మానించారు. బీజేపీలో కష్టపడే ప్రతీ కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని ఈ సందర్భంగా లక్ష్మణ్ పేర్కొన్నారు

● చిక్కడపల్లి, ఆంధ్రజ్యోతి



స్కాలర్‌షిప్‌లు, నోటు పుస్తకాల పంపిణీలో సూర్యనారాయణగుప్తా, తదితరులు

విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలి

● నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే సూర్యనారాయణగుప్తా

బర్కత్‌పుర, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ఉన్నతస్థాయికి ఎదగాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే దన్‌పాల్ సూర్యనారాయణగుప్తా సూచించారు. శనివారం రాత్రి కాచిగూడలోని వైశ్యా హాస్టల్‌లో విద్యార్థులకు నోటుపుస్తకాలు, స్కాలర్‌షిప్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సూర్యనారాయణగుప్తా మాట్లాడుతూ వైశ్యహాస్టల్ విద్యార్థి హర్షిద్‌సాయి ఇంటర్‌లో రాష్ట్రస్థాయి 4వ ర్యాంక్ సాధించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైశ్యహాస్టల్ ట్రస్ట్ బోర్డు చైర్మన్ జి.ధనుంజయ, కార్యదర్శి విశ్వనాథం నాగేష్, రఘువీర్, ఉప్పల రాజేశ్వర్, పబ్బతి రవి, ప్రసన్నకుమార్, రాజేశ్వర్‌రావు, భాస్కర్‌గుప్తా, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ మహారాజ్ శోభాయాత్ర పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఏడుకొండలుగౌడ్ తదితరులు

గౌడ్‌లు రాజ్యాధికారం కోసం సమష్టిగా పోరాటం చేయాలి

రాంనగర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): బహుజన ఉద్యమకారుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ స్ఫూర్తితో గౌడ కులస్థులందరూ రాజ్యాధికారం సాధన కోసం సమష్టిగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందని జై గౌడ సేన సంఘం జాతీయ అధ్యక్షుడు, పాపన్న శోభాయాత్ర కన్వీనర్ డాక్టర్ మోర్ల ఏడుకొండలు గౌడ్ పేర్కొన్నారు. సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 374వ జయంతి సందర్భంగా శనివారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో పాపన్నగౌడ్ అవార్డుల ప్రదానం, శోభాయాత్ర జెండా విష్కరణ కార్యక్రమాలు జై గౌడ సేన సంఘం ఆధ్వర్యంలో జరిగాయి. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాపన్నగౌడ్ శోభాయాత్రను రాష్ట్రంలోని గడపగడపకూ తీసుకెళ్లి బహుజన రాజ్యం సాధిస్తామన్నారు. జనగామ జిల్లాకు పాపన్నగౌడ్ పేరు పెట్టాలన్నారు. జనాభా ప్రాతిపదికన గౌడ్‌లకు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో వాటా ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో గౌడ సంఘం ప్రముఖులు జైహింద్‌గౌడ్, అశోక్‌కుమార్‌గౌడ్, పడమటి సాయి, కె.శ్రీనివాస్‌గౌడ్, అంబాల నారాయణగౌడ్, పంజాల శ్రావణ్‌గౌడ్, చక్రవర్తిగౌడ్, మమతగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆహార కల్తీపై రాష్ట్రవ్యాప్తంగా వినియోగదారుల మండలి సర్వే

చిక్కడపల్లి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఆహార కల్తీపై తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా సర్వే చేస్తున్నట్లు వినియోగదారుల మండలి రాష్ట్ర అధ్యక్షుడు సాంబరాజు చక్రపాణి తెలిపారు. గోల్కొండచౌరస్తాలోని మండలి రాష్ట్ర కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. ఆహార కల్తీ వల్ల ప్రమాదాలు, సంపూర్ణ పౌష్టికాహారం ఆవశ్యకత, కల్తీలేని ఆహార పదార్థాల ధ్రువీకరణ క్వాలిటీ సింబల్స్‌కు సంబంధించిన అంశాలపై ప్రజలను చైతన్యవంతం చేసే కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నామన్నారు. ముఖ్యంగా పాలల్లో కల్తీపట్ల జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లకు సరఫరా అవుతున్న పోర్టిఫైడ్ బియ్యం సరఫరాలో లోటుపాట్లపై కూడా సర్వే చేస్తామన్నారు. వినియోగదారుల మండలి సభ్యులు దామోదర్, వీఎస్ శర్మ, ప్రవీణ్, శ్రీనివాస్, రత్నాకర్, రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సహకారంతోనే శాంతిభద్రతల పరిరక్షణ

● ఈస్ట్ జోన్ అడిషనల్ డీసీపీ నర్సయ్య

ముషీరాబాద్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజల సహకారంతోనే శాంతిభద్రతల పరిరక్షణ సాధ్యమవుతుందని ఈస్ట్ జోన్ అడిషనల్ డీసీపీ నర్సయ్య అన్నారు. శనివారం ఈస్ట్ జోన్ అడిషనల్ డీసీపీగా బాధ్యతలు చేపట్టిన నర్సయ్యను ముషీరాబాద్‌కు చెందిన సందీప్ కుమార్ ఆధ్వర్యంలో పలువురు సన్మానించారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ ముషీరాబాద్ ప్రజలతో తనకు స్నేహసంబంధాలు ఉన్నాయన్నారు. సందీప్ కుమార్ మాట్లాడుతూ డీసీపీ నర్సయ్య గతంలో చిక్కడపల్లి ఏసీపీగానూ, సీఐగానూ బాధ్యతలు నిర్వహించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు విజయ్ కుమార్, సమీర్ తదితరులు పాల్గొన్నారు.



డీసీపీ నర్సయ్యను సన్మానించిన సందీప్ ముదిరాజ్ తదితరులు



ఉచిత వైద్య శిబిరంలో సయ్యద్ మోహిన్, తదితరులు

ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ముషీరాబాద్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్యశిబిరాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర కో-కన్వీనర్ సయ్యద్ మోహిన్ కోరారు. శనివారం భోలక్‌పూర్‌లోని బైబిల్‌హౌస్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(యూపీహెచ్‌సీ) ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. ఈ సందర్భంగా మోహిన్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులను దృష్టిలో పెట్టుకొని బస్తీల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో యూపీహెచ్‌సీ ఏఎన్ఎం లక్ష్మీబాయి, ప్రేమలత, నాయకులు శ్రీనివాస్, సత్యనారాయణ, వెంకట్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కోర్సుల్లో యువత శిక్షణ పొందాలి

● ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కోర్సుల్లో యువత శిక్షణ పొంది ఆర్థికంగా ఎదగాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. శనివారం టెక్‌మహీంద్ర ఫౌండేషన్, అప్సా స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లిష్, టైపింగ్ తదితర రంగాల్లో టెక్‌మహీంద్ర, అప్సా స్వచ్ఛంద సంస్థలు నిరుద్యోగులకు ఉచితంగా శిక్షణ ఇస్తూ వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడం అభినందనీయమన్నారు. శిక్షణ పొందిన వారికి ఉద్యోగ అవకాశాలు సైతం కల్పిస్తున్నారని, యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిక్షణ కేంద్రం మేనేజర్ షేక్ మౌలా మాట్లాడుతూ 10వ తరగతి పాసై 18 నుంచి 27 సంవత్సరాల మధ్య వయసు గల నిరుద్యోగులు శిక్షణకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఇతర వివరాలకు 9154990135లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు రవిప్రకాష్, జయశ్రీ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



ఉచిత కంప్యూటర్ శిక్షణ పోస్టర్‌ను ఆవిష్కరించిన ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు

కవులు దాశరథి, సినారె వారసులవ్వాలి

చిక్కడపల్లి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కవులు నిరంతర కవులుగా మారాలని అప్పుడే దాశరథి, సినారె వారసులవుతారని ప్రముఖ సాహితీవేత్త డా.ఏనుగు నరసింహారెడ్డి అన్నారు. తెలుగు భాషా చైతన్య సమితి, నక్క వెంకటమ్మయాదవ్, నక్క యాదగిరిస్వామి ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ ఫౌండేషన్, త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో కుసుమ ధర్మన్న కళాపీఠం ముద్రించిన మహాకవి దాశరథి, డా.సి.నారాయణరెడ్డి పుస్తకాల ఆవిష్కరణ సభ శనివారం మధ్యాహ్నం గానసభలో ప్రముఖ కవి, విమర్శకులు గంటా మనోహర్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. పుస్తకాన్ని ఆవిష్కరించిన ఏనుగు నరసింహారెడ్డి మాట్లాడుతూ కవులు నిరంతరం కవిత్వం రాయాలని సూచించారు. దాశరథి, సినారెలు తెలుగు సాహిత్య అభివృద్ధికి చేసిన కృషి అనన్యసామాన్యం అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి ఎస్.బాలాచారి, గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి, సంఘసేవకులు శ్రీనివాస్‌యాదవ్, రామకృష్ణచంద్రమౌళి, వేమూరి అనంతరామకృష్ణశర్మ, అంజనీకుమారి, పాలడుగు సరోజినీదేవి, దాశరథి పురస్కారగ్రహీత కర్నాటి రఘురాములు గౌడ్, సినారె పురస్కారగ్రహీత గజవెల్లి సత్యనారాయణస్వామి, నిర్వాహకులు బడేసాబ్ పాల్గొన్నారు. మంజుల వేమూరి ఈసందర్భంగా దాశరథి, సినారె సినీగీతాలను మధురంగా ఆలపించారు. రాధా కుసుమ పర్యవేక్షణలో కవిసమ్మేళనం జరిగింది.



దాశరథి, డా.సి.నారాయణరెడ్డి పుస్తకాలను ఆవిష్కరిస్తున్న నరసింహారెడ్డి, తదితరులు

పేదింటి అమ్మాయిల పెళ్లికి సహకారం

● అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ గుప్తా



పుస్తెమెట్టెలు, దుస్తులు అందజేస్తున్న శ్రీనివాస్‌గుప్తా తదితరులు

ముషీరాబాద్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కుల, మతాలకు అతీతంగా పేదింటి అమ్మాయిల పెళ్లికి అన్నివిధాలా సహకరిస్తామని అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్(ఐ.వి.ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు, టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో-కన్వీనర్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. శనివారం ముషీరాబాద్ ఆర్యవైశ్య భవన్‌లో పేద కుటుంబాలకు చెందిన యువతులకు పుస్తెమెట్టెలు, దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గుప్తా మాట్లాడుతూ ఐవీఎఫ్ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పేదలను ఆదుకుంటున్నామన్నారు. విద్యా, వైద్యం అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఉప్పల స్వప్న, సత్తయ్య, చంద్రశేఖర్, శ్రీనివాస్, భాగ్యలక్ష్మి, ఐవీఎఫ్ జాతీయ నాయకుడు గంజి రాజమౌళిగుప్తా, నాయకులు లక్ష్మి, రమ పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లు పెంచకుండా ఎన్నికలు నిర్వహిస్తే తిరుగుబాటే

● బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం

బర్కత్‌పుర, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లను పెంచకుండా స్థానికసంస్థల ఎన్నికలు నిర్వహిస్తే కాంగ్రెస్ ప్రభుత్వానికి బీసీల తిరుగుబాటు తప్పదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌కు అనుగుణంగా తక్షణమే బీసీ కులగణనను చేపట్టిన తర్వాతే స్థానికసంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. శనివారం కాచిగూడలో బీసీ సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యసభసభ్యులు ఆర్.కృష్ణయ్య సారథ్యంలో స్థానికసంస్థల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధన కోసం గ్రామస్థాయి నుంచి ఉద్యమాలు చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం బీసీలను పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. సమావేశంలో బీసీ సంఘాల నేతలు జి.మల్లేష్ యాదవ్, వేముల రామకృష్ణ, నందగోపాల్, ఉదయ్‌నేత తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సత్యం



శివశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రొఫెసర్ వెంకట్రావు తదితరులు

శివశంకర్ జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలి

బర్కత్‌పుర, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మాజీ మంత్రి శివశంకర్ జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్ బోర్డు చైర్మన్ ప్రొఫెసర్ మేడం వెంకట్రావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం కాచిగూడ మున్నూరుకాపు భవన్‌లో శివశంకర్ 75వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర న్యాయశాఖ మంత్రిగా శివశంకర్ అనేక సంస్కరణలు తీసుకువచ్చారని, న్యాయవ్యవస్థకే వన్నె తెచ్చారని కొనియాడారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు ట్రస్ట్ బోర్డు ట్రస్టీ పిల్లి శ్రీనివాస్, నాయకులు రాఘవేందర్, దేవేందర్, అమరం చంద్రశేఖర్, చామకూర సుజాత, అన్నపూర్ణ, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

రాంనగర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీ కులాల గుర్తింపు, సామాజిక న్యాయం కోసం పోరాడిన వ్యక్తి దివంగత మాజీ కేంద్ర మంత్రి పి.శివశంకర్ అని కాంగ్రెస్ ఓబీసీ సెల్ జాతీయ విభాగం మాజీ చైర్మన్ డాక్టర్ పి.వినయ్‌కుమార్ కొనియాడారు. శనివారం అడిక్‌మెట్ డివిజన్‌లోని లలితానగర్ కమ్యూనిటీహాల్లో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఏ మోహిద్ ఆధ్వర్యంలో శివశంకర్ జయంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి జి.ఎన్.కేశవ్, నాయకులు నామ్‌దేవ్, రషీద్, జి.నాగేందర్, నరేందర్, బల్వంత్, విజయ్‌కుమార్‌యాదవ్, సాయిముదిరాజ్ పాల్గొన్నారు.

దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి

కవాడిగూడ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డ్ కులాల వారికి మత స్వేచ్ఛ కల్పించాలని, జస్టిస్ రంగనాథ్ మిశ్రా కమిషన్ నివేదికను అమలు చేస్తూ దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పిస్తూ శాసనసభలో తీర్మానం చేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్(ఏఐసీఎఫ్) తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఇందిరాపార్కు వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా జస్టిస్ చంద్రకుమార్, ప్రొఫెసర్ పీఎల్ విశ్వేశ్వర్‌రావు, దళిత స్త్రీ శక్తి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు గడ్డం ఝాన్సీ, తెలుగు క్యాథలిక్ బిషప్ కౌన్సిల్ డిప్యూటీ సెక్రటరీ రెవరెండ్ రాజు అలెక్స్, తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ చర్చెస్ ప్రధాన కార్యదర్శి రెవరెండ్ డాక్టర్ బాస్కర్, స్కైలాబ్, దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి శంకర్, గిడియన్ బాబు మాట్లాడారు. దళిత క్రైస్తవులపై దాడులను అరికట్టాలని, నిరుపేద పాస్టర్లకు గౌరవ వేతనం ఇవ్వాలని, క్రైస్తవుల సమాధులకు స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత క్రైస్తవులు, చర్చిల పాస్టర్‌లు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న క్రైస్తవ సంఘాల నేతలు

పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టాలి

షెడ్యూల్డ్ కులాల వారికి మత స్వేచ్ఛ, దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని క్రిస్టియన్ పొలిటికల్ ఫ్రంట్ వ్యవస్థాపకులు జెరుసలెం మత్తయ్య డిమాండ్ చేశారు. క్రిస్టియన్ పొలిటికల్ ఫ్రంట్, భారత క్రిస్టియన్ కౌన్సిల్, క్యాథలిక్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ, ఇండియన్ క్రిస్టియన్ కౌన్సిల్ సంఘాల ఆధ్వర్యంలో శనివారం లోయర్ ట్యాంక్‌బండ్ వద్ద గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఆయా సంఘాల నేతలు మత్తయ్య, బాస్కర్ ముల్కల, ఆంధ్రూ జేవియర్, చావల జోసెఫ్ మాట్లాడారు. దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కేంద్రంపై కాంగ్రెస్ పార్టీ ఒత్తిడి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో క్రైస్తవ సంఘాల నేతలు పాల్గొన్నారు.

అక్రమంగా రేషన్ తరలిస్తున్న ముఠా అరెస్ట్



పోలీసుల అదుపులో నిందితులు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న ముఠా ఆటకట్టించారు సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు. సివిల్ సప్లై, చంద్రాయణగుట్ట పోలీసులతో కలిసి ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి 14 టన్నుల రేషన్ బియ్యాన్ని, 15 క్వింటాళ్ల గోధుమలను సీజ్ చేశారు. చంద్రాయణగుట్టకు చెందిన మహ్మద్ రిజ్వాన్, ఉప్పరిగూడకు చెందిన రజనీకాంత్, రాజేశ్వర్ మరో నలుగురు ముఠాగా ఏర్పడ్డారు. రేషన్ దుకాణాల నుంచి సప్లై చేసిన బియ్యం, గోధుమలను కస్టమర్స్ నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి, ఆ తర్వాత డీసీఎం లారీల్లో లోడ్ చేసి ఇతర రాష్ట్రాలకు తరలించి ఎక్కువ ధరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు, సివిల్‌సప్లై అధికారులతో కలిసి చంద్రాయణగుట్ట పోలీసుల సహకారంతో ముఠాను పట్టుకున్నారు. ముగ్గురిని అరెస్టు చేశారు. మరో నలుగురు పరారీలో ఉన్నారు. చంద్రాయణగుట్ట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చైన్ సిస్టం స్కీంలో చేర్పించి మోసం

● నలుగురిపై చీటింగ్ కేసు నమోదు

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): చైన్‌సిస్టం స్కీంలో చేర్పించి మోసం చేసిన నలుగురిపై కేసు నమోదు చేసిన సంఘటన ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ మున్సిపాలిటీకి చెందిన సైనోజు మనోరమ అనే మహిళ స్పాట్ లోన్ క్లౌడ్ టెక్నిక్ కంపెనీలో చేరి పీఆర్ఎం ప్రసాద్ ద్వారా రూ. 1,600కు ఐడీ తీసుకుంది. మరో ఇద్దరిని చేర్పిస్తే లాభాలు వస్తాయని కంపెనీ నిబంధనల ప్రకారం రూ. 3,200 చెల్లించి మరో ఇద్దరిని సంస్థలో చేర్పించింది. వీరిద్దరు మరో నలుగురిని చేర్పించి, మొత్తం 7 మంది సభ్యులతో రూ. 12,000 చెల్లించగా ఎలాంటి లాభం రాలేదు. దీంతో సంస్థల ప్రతినిధులను సంప్రదించగా ముఖం చాటేశారు. డబ్బులు కట్టినవారు వేధింపులకు దిగడంతో మానసిక వేదనకు గురైన మనోరమ కంపెనీ ఎండీ కాకుమను క్రాంతికుమార్, ప్రతినిధులు కొండవీటి సాయి ప్రశాంత్, నర్రిశెట్టి పావనిలపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. జూమ్ యాప్ ద్వారా కంపెనీలో చేర్పించి ప్రజలను మోసం చేస్తున్నారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నది. దేశవ్యాప్తంగా పదిలక్షల మందిని స్పాట్ లోన్ క్లౌడ్ టెక్నిక్ కంపెనీ వారు డబ్బులు కట్టించుకొని మోసం చేశారని తెలిపింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



నిరసన కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరించిన పీవైఎల్ నేతలు

పీవైఎల్ ఆధ్వర్యంలో రేపు 'చలో జీహెచ్ఎంసీ'

రాంనగర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవడంలో జీహెచ్ఎంసీ యంత్రాంగం విఫలమైందని ప్రోగ్రెసివ్ యూత్ లీగ్(పీవైఎల్) గ్రేటర్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.రవికుమార్, బి.ఎస్.కృష్ణ ఆరోపించారు. శనివారం విద్యానగర్‌లోని మార్క్స్‌భవన్‌లో 'చలో జీహెచ్ఎంసీ' పోస్టర్‌ను వారు ఆవిష్కరించి మాట్లాడారు. నగరంలో పారిశుధ్య పనులను పరిపూర్ణంగా నిర్వహించడంతో పాటు దోమల నివారణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రతీ వారం క్రమం తప్పకుండా వీధుల్లో ఫాగింగ్ చేయాలని, యాంటీ లార్వా ఆపరేషన్ ఇంటింటికీ చేయాలని, శుభ్రమైన నీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీవైఎల్ నాయకులు మనోహర్, సాయి, ప్రసాద్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ వర్గీకరణ అమలు చేయాలి

చిక్కడపల్లి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఎస్టీలో ఏబీసీడీ వర్గీకరణ అమలు చేయాలని తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోకిని రాజు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం సాయంత్రం చిక్కడపల్లిలోని ఓ హోటల్‌లో తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం, ఎరుకల ఉద్యోగుల సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది ఈసందర్భంగా రాజు మాట్లాడుతూ ఆదివాసీ ఎరుకల జాతి విద్యా, ఉద్యోగ, ఉపాధి, ఆర్థిక రాజకీయరంగాల్లో వెనకబడి ఉన్నారని, ఏకలవ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసి వెయ్యి కోట్ల బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. ఎరుకల ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ సదానందం మాట్లాడుతూ అర్హులైన నిరుపేద ఆదివాసీ ఎరుకల కుటుంబాల అభివృద్ధి కోసం బ్యాంకుతో సంబంధం లేకుండా నూటికి నూరుశాతం సబ్సిడీతో రూ.10 లక్షల రుణం ఇవ్వాలన్నారు. సమావేశంలో రవికుమార్, నరసింహ, రమేష్, నాగులు, ఆనంద్, శ్రీరామ్, రాజు, రాజశేఖర్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

కళాధర్‌నగర్‌లో అక్రమ కట్టడాన్ని కూల్చివేయాలి

ముషీరాబాద్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ డివిజన్‌లోని కళాధర్‌నగర్‌లో అక్రమంగా నిర్మించిన భవనాన్ని కూల్చివేయాలని కోరుతూ కళాధర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. శనివారం కళాధర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్ కుమార్, ఉపాధ్యక్షుడు నరేందర్ కుమార్, ప్రధాన కార్యదర్శి నాగరాజు, కోశాధికారి సతీష్‌బాబు మాట్లాడారు. కళాధర్‌నగర్ పార్కు సమీపంలో ఫుట్‌పాత్ స్థలాన్ని ఆక్రమించి ఎలాంటి అనుమతులు లేకుండా ఓ వ్యక్తి నాలుగు అంతస్తుల భవనం నిర్మించారని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు భవన యజమానిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బాబాలపై కఠిన చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న రమేష్

బర్కత్‌పుర, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొంత మంది బాబాలు ఆధ్యాత్మికతను వ్యాపారంగా మార్చుకొని ప్రజలను దోపిడీ చేస్తున్నారని విజ్ఞాన దర్శిని రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ ఆరోపించారు. బాబాలపై పూర్తి విచారణ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. నిర్మల్ పట్టణానికి చెందిన శివరాజ యోగి కృష్ణస్వామి కోట్ల రూపాయలతో ఆశ్రమాలను నిర్మించుకుని వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించుకున్నారని ఆరోపించారు. కృష్ణస్వామి ఆశ్రమంలో మహిళలపై దాడులు, లైంగిక వేధింపులు నిత్యకృత్యం అయ్యాయని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. నారాయణపేట జిల్లా మద్దూరు మండల కేంద్రంలో మహబూబ్ అలీ దెయ్యాలు, భూతాలు పారదోలుతానని ప్రజలను నమ్మిస్తూ ఆర్థిక దోపిడీ చేస్తున్నారని, మహిళలు, యువతులను లైంగిక వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు.



మాట్లాడుతున్న సయ్యద్ ముక్తార్ హుస్సేన్, సిద్ధిఖి తదితరులు

వక్ఫ్‌బోర్డు భూములను స్వాధీనం చేసుకోవాలి

నల్లకుంట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అన్యాకాంతమైన వక్ఫ్‌బోర్డు భూములను స్వాధీనం చేసుకోవాలని ఆలిండియా ముస్లిం మైనారిటీ ఆర్గనైజేషన్ చైర్మన్ సయ్యద్ ముక్తార్ హుస్సేన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అప్పట్లోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్.కె.సిన్హా కమిషన్, గత కేసీఆర్ ప్రభుత్వం అన్యాక్రాంతమైన వక్ఫ్‌బోర్డు భూములపై సీబీసీఐడీ విచారణ చేశారని, నేటి వరకూ ఎలాంటి విషయాలను బహిర్గతం చేయకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. శనివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉమ్మడి ఏపీ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఎం.ఎ.సిద్ధిఖీతో కలిసి ఆయన మాట్లాడారు. గ్రేటర్ పరిధిలో ముస్లిం శ్మశానవాటికలు దాదాపు కనుమరుగయ్యాయని, నగర శివారులో 100 ఎకరాల వక్ఫ్‌బోర్డు భూమిని శ్మశానవాటికల కోసం కేటాయించాలన్నారు. ఇల్లు లేని ముస్లింలకు 100 చదరపు గజాల వక్ఫ్‌బోర్డు భూమిని కేటాయించాలని కోరారు. సమావేశంలో నాయకులు సనాఉల్లాఖాన్, ఖైరొద్దీన్, దస్తగిరి, సలీం తదితరులు పాల్గొన్నారు.



జ్యోతిప్రజ్వలన చేస్తున్న డాక్టర్ నరేందర్‌రెడ్డి

విద్యార్థులు సామాజిక స్పృహ కలిగి ఉండాలి

● ఆల్ఫోర్స్ జూనియర్ కళాశాలల చైర్మన్ డాక్టర్ నరేందర్‌రెడ్డి

రాంనగర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు సంస్కారం, సామాజిక స్పృహ కలిగి ఉండాలని ఆల్ఫోర్స్ జూనియర్ కళాశాలల చైర్మన్ డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి అన్నారు. విద్యార్థులు తల్లిదండ్రులు, గురువులు చెప్పే మాటలు విని తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. శనివారం విద్యానగర్‌లో ఆల్ఫోర్స్ జూనియర్ కళాశాల విద్యార్థుల కల్చరల్ ఫెస్ట్-2024 జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన నరేందర్‌రెడ్డి ఐఐటీ, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ర్యాంక్‌లు సాధించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈసందర్భంగా విద్యార్థులు నిర్వహించిన ఫ్యాషన్ షో, సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డి.సుబ్బారావు, వైస్ ప్రిన్సిపాల్ స్వప్న, అధ్యాపకులు పాల్గొన్నారు.

గోమాత సంరక్షణ బాధ్యత అందరిది

సైదాబాద్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతికి వారసత్వానికి ప్రతి రూపమైన గోమాతను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అఖిల భారత ఆర్ఎస్ఎస్ గోసేవా విభాగ్ అధ్యక్షుడు అజిత్ జీ మహాపాత్ర తెలిపారు. సైదాబాద్ లక్ష్మీనగర్‌కాలనీలోని అఖిల భారత గోసేవా ఫౌండేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని గోవులను సంరక్షిస్తామని ప్రతి ఒక్కరూ ప్రమాణం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అఖిల భారత ఆర్ఎస్ఎస్ గోసేవా విభాగ్ ఉపాధ్యక్షుడు నావల్ కిషోర్, అఖిల భారత గోసేవా ఫౌండేషన్ అధ్యక్షుడు బాలకృష్ణ గురుస్వామి, ప్రతినిధులు శ్రీనాథ్, తెలంగాణ గుజరాతి సంఘం అధ్యక్షుడు జిగ్నేష్ జోషి పాల్గొన్నారు.